క్లుప్తంగా

కేఎంసీ క్యాంటీన్‌కు మళ్లీ తాళం



క్యాంటీన్‌కు తాళం వేసిన వైద్యుల సంఘం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు క్యాంటీన్ మూదని తాళం వేయడం , నిర్వాహకులు దానిని తెరుచుకుని వ్యాపారం చేయడం పరిపాటిగా మారింది. తాజాగా బుధ వారం మరోసారి వైద్యుల సంఘం నాయకులు క్యాంటీన్‌కు తాళం వేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ.. క్యాంటీన్ విషయమై గతం లోనే కళాశాల ప్రిన్సిపాల్‌కు, మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పుడు వేసిన తాళాన్ని పగులగొడితే మళ్లీ ఫిర్యాదు చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకునేలా చేస్తామని చెప్పారు. క్యాంటీన్ వైద్యుల సంఘా నికి సంబంధించినదని, దీన్ని తామే నిర్వహి స్తామని స్పష్టం చేశారు. సంఘం నాయకులు డాక్టర్ రామకృష్ణనాయక్, డాక్టర్ దమామ్ శ్రీని వాసులు, డాక్టర్ రామశివనాయక్, డాక్టర్ రం గయ్య తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన రికార్డ్స్ రూమ్



కర్నూలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూతపడిన రికార్డ్స్ రూమ్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డ్స్ రూమ్ రెం డు రోజులుగా మూతపడింది. దీంతో 1983 కంటే ముందు ఉన్న రికార్డులకు సంబంధించి ఈసీలు, సీసీ కాపీలు, ఇతర డాక్యుమెంట్ల కోసం క్రయవిక్రయదారులు వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కర్నూలు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఉన్న వరప్రసాద్ సెలవులో వెళ్ల డంతో సీనియర్ అసిస్టెంట్ భవానీప్రసాదు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన రికార్డు రూమ్ బాధ్యతలు, ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించలేక దానిని మూత వేశారు. ఈ క్రమంలో కర్నూలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న జాయింట్-1, 2 సబ్ రిజిస్ట్రార్లను నియమించి కష్టాల నుంచి గట్టె క్కించాలని వినియోగదారులు కోరుతున్నారు.

చారిత్రక కట్టడాలను పరిరక్షించాలి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు జిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను పరిరక్షిం చాలని ప్రొఫెసర్ ఎస్ మన్సూర్ రహమాన్ అన్నారు. బుధవారం సాయంత్రం పింగళి సూరన తెలుగుతోటలో జిల్లా మేధావుల ఆధ్వ ర్యంలో గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశే ఖర్ కల్కూర అధ్యక్షతన జిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రదేశాల పరిరక్షణ ఆవశ్యకతపై చర్చాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్రగల వారసత్వ సంపదగా ఉన్న ప్రభుత్వ భవనాలు జిల్లా పరిషత్, కర్నూలు మున్సిపల్ స్కూల్, ప్రభుత్వ గడియారం ఆసుపత్రి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నిర్వహణను గాలికొదిలే శారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా కాలేజీ భవనానికి వారసత్వ ప్రదేశంగా, పెద్ద కదుమూరులోని రాయల చెరువును ప్రపంచ నీటి నిర్మాణంగా గుర్తింపు వచ్చేలా చర్యలు చేప ట్టాలన్నారు. కేతవరం రాతిచిత్రాల పరిరక్షణ కోసం అక్కడి కొంత ప్రాంతాలలో జరుగు తున్న మైనింగ్‌ను ఆపేయాలన్నారు. ప్రపంచ వారసత్వ నీటి నిర్మాణమైన కేసీ కెనాల్ సుం దరీకరణ పనులు చేపట్టాలన్నారు. ప్రాచీన ప్రార్థనా స్థలాలుగా చరిత్రకెక్కిన దేవాలయా లు, దర్గాలు, చర్చీలు, గురుద్వారాలు, జైనమం దిరాలను అభివృద్ధి చేయాలన్నారు. కర్నూలు జిల్లా వైభవాన్ని తెలియజేసి, చారిత్రక కట్ట డాల, ప్రదేశాల ప్రస్తుత స్థితిగతులను పరిశీలిం చి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. చర్చాగోష్టిలో రిటైర్డ్ జేడీ చంద్రశేఖర్, డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌పై కుంగిన గ్రిల్



చిన్న అమ్మవారి శాల వద్ద మ్యాన్‌హోల్‌పై కుంగిన గ్రిల్

కర్నూలు నగరంలోని పూలబజార్ వద్ద చిన్న అమ్మవారి శాల ఎదురుగా భారీ గుంత ఏర్ప డింది. మురికి కాలువపై ఏర్పాటు చేసిన గ్రిల్ కుంగిపోవడంతో అడుగు లోతు గుంత కనిపి స్తోంది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు తిరుగుతుంటారు. నడి రోడ్డుపై గ్రిల్ కుంగడంతో ఇబ్బందులు పడు తున్నారు. నిత్యం బిజీగా ఉండే ఈ రహదా రిలో మ్యాన్‌హోల్‌పై నూతన గ్రిల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- మేయర్ బీవై రామయ్య
- 22 తీర్మానాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం
- రూ.7.31 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు నగర మేయర్ బీవై రామయ్య వెల్లడించారు. బుధవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.7.31 కోట్లు కేటాయించారు. అలాగే 22 తీర్మానాలను ఆమోదించారు. కమిషనర్ పి.విశ్వనాథ్, అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహా రెడ్డి, షేక్ యూనుస్ బాషా, జుబేర్, క్రాంతి, చిట్టెమ్మ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాల్లో కొన్ని..

- 200 మంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికుల కాల పరిమితి 5 నెలలు పొడిగించి రూ.1.72 కోట్లు కేటాయించారు.
- 7వ వార్డు జెండా వీధి, సున్నం వీధి ప్రాంతాల్లో రూ.30 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణం
- బసవ కూడలి సెంట్రల్ మీడియన్ అభివృద్ధికి రూ.50 లక్షల మంజూరు
- మోక్షగుండం విశ్వేశ్వరయ్య సర్కిల్ విస్తీర్ణం తగ్గించి అభివృద్ధి చేసేందుకు రూ.25 లక్షలు కేటాయించారు.
- 46వ వార్డు అశోక్‌నగర్‌లో రూ.49.60 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం
- 49వ వార్డు ఎన్ఆర్ పేటలో రూ.22 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- తుంగభద్ర నది వద్ద ఓల్డ్ పంప్‌హౌస్‌లో రూ.22.50 లక్షలతో వాహనాల గ్యారేజ్ నిర్మాణం
- 19వ వార్డు రాంప్రియ నగర్‌లో రూ.45 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- 20వ వార్డు బీటీఆర్ నగర్‌లో రూ.49 లక్షలతో సీసీ డ్రైన్ రహదారుల నిర్మాణం
- 31వ వార్డు శరీన్ నగర్‌లో రూ.35 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం
- పెద్దపాడులో రూ.49.90 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం
- 29వ వార్డులో సాంబశివ నగర్, పార్థసారధి నగ ర్‌లో రూ.35 లక్షలతో పైప్‌లైన్ల నిర్మాణం
- 40వ వార్డు సంతోష్ నగర్‌లో రూ.45 లక్షలతో సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణం
- 18వ వార్డు జొహరాపురం అబ్దుల్ సత్తార్ నగ ర్‌లో రూ.18 లక్షలతో పైప్‌లైన్, అలాగే రూ.50 లక్షలతో డబ్ల్యూబీఎం రహదారి నిర్మాణం
- 17వ వార్డు జొహరాపురం తెలుగు గేరిలో పబ్లిక్ టాయిలెట్ల పునర్నిర్మాణానికి రూ.38.50 లక్షల కేటాయింపునకు ఆమోదం తెలిపారు

పందుల పోషణకు స్థలం కేటాయింపు

కర్నూలు (టౌన్): నగరంలో పందుల బెడద నివారణ కోసం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదే శాల మేరకు.. పందుల పెంపకందారుల కోసం బస్తిపాడు గ్రామంలో 362, 552 సర్వే నంబ ర్లలో 4.15 ఎకరాల భూమిని కేటాయించినట్లు నగర మేయర్ బీవై.రామయ్య వెల్లడించారు. బుధవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో యూఎల్‌బీ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. నగరంలో పందుల బెడద తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కోర్టు ఆదేశాల మేరకు సదరు భూమిని కేటాయించామన్నారు. నగ రపాలక కమిషనర్ పి.విశ్వనాథ్, డిప్యూటీ కమి షనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అపర భగీరథుడు వైఎస్సార్

కర్నూలు (సిటీ): రాయలసీమ జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాల కోసం దూరదృష్టితో హంద్రీ - నీవా సుజల స్రవంతి పథకాన్ని చేపట్టి అపర భగీరథుడుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి నిలిచారని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దివంగత ముఖ్య మంత్రి మరణం తర్వాత హంద్రీ - నీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో నందికొట్కూరు ఎమ్మెల్యేగా తాను కీలక పాత్ర పోషించానన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎదిరించినా పోతిరెడ్డి పాడును విస్తరించి ఎస్ఆర్ఎంసీ కెనాల్‌ను వెడల్పు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుంద న్నారు. తన రాజకీయ గురువు వైఎస్సార్ బాటలో నందికొట్కూరు నియోజకవర్గంలో 32 వేల ఎకరా లకు ఏడు ఎత్తిపోతల పథకాలు నిర్మించి సాగు నీరు అందించామన్నారు. ప్రజల్లో మంచి పేరు ఉండాలని ఆశించి నందికొట్కూరు నియోజకవ ర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాన న్నారు. ఈ రోజు సీఎం చంద్రబాబునాయుడు మల్యాల వద్ద శ్రీశైలం నీటిని హంద్రీ - నీవా ద్వారా పంపింగ్ చేసేందుకు వస్తున్నారంటే అది ఆనాడు వైఎస్సార్ ఆలోచనతో హెచ్ఎన్ఎస్ఎ స్‌ను నిర్మించడంతోనేనని స్పష్టం చేశారు. ఈ రోజు రాయలసీమలోని నాలుగు జిల్లాలతో పాటు కుప్పం వరకు సాగునీరు వెళ్తోందన్నారు.

బంగారు కుటుంబాల జాబితా పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జీరో పావర్టీ పీ-4 పాలసీలో భాగంగా జిల్లాలో జూలై 15 నుంచి 25వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించి బంగారు కుటుం బాల జాబితాపై మరోసారి పరిశీలన చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించా రు. జాబితాలో అనర్హులు ఉంటే వారిని తొలగించి అర్హులతో తుది జాబితాను రూపొందించాలని, జూలై 31 నాటికి మార్గదర్శకుల ఎంపిక పూర్తి కావా లన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎంపీ డీఓలు, జిల్లా విజన్‌ప్లాన్ యూనిట్‌లు, నియోజక వర్గ విజన్‌ప్లాన్ యూనిట్ సభ్యులతో జీరో పావర్టీ పీ-4 పాలసీ అమలుపై కలెక్టర్ సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ.. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం అంటే ఆర్థిక సాయం చేయడం ఒక్కటే కాదని, ఆ కుటుంబాలకు అన్ని విధాలుగా మార్గదర్శకంగా నిలవాలన్నారు. పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, ఇంజినీర్లు, విద్యా సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు మార్గ దర్శకులుగా ముందుకు రావాలని, గ్రామాల వారీ గా మార్గదర్శకులను గుర్తించేందుకు కమిటీలను నియమించాలని సీపీఓ హిమప్రభాకరరాజును ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పీ-4 పాలసీ కన్సల్టెంట్ స్వర్ణ, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డీఈఓ శామ్యూల్ పాల్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

నగరాన్ని కొత్త హంగులతో తీర్చిదిద్దాలి



మున్సిపల్ అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (న్యూటౌన్): నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్ది, 'న్యూ లుక్' తేవాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆయన బుధవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృ హంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. కర్నూలు నగరాన్ని విశాఖ తరహాలో తీర్చిదిద్దేం దుకు కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి పను లను ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయొద్దన్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల పురోగతిపై ఆరా తీశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, పనులను జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసు కోవాలని సూచించారు. రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుంచి జమ్మిచెట్టు వరకు హంద్రీ నది ఒడ్డున నిర్మిస్తున్న రహదారి పనులను వేగవంతం చేయాలని, బండ్ మరింత పటిష్టంగా ఉండేందుకు జలవనరుల శాఖ అధికారుల సలహాలు తీసుకోవాల న్నారు. పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆదేశిం చారు. డిసెంబర్ నాటికి 30 వేల మొక్కలు నాటి సం రక్షించాలన్నారు. వెండర్ జోన్లను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ జునైద్, తదితరులు పాల్గొన్నారు.

రైతు విశ్రాంతి భవనంలో మంచాలు మాయం

- అన్ని గేట్లలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా మాయం కావడంపై అనుమానాలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు విశ్రాంతి భవనంలో ఇనుప మంచాలు (ఐరన్ కాట్స్) మాయం అవుతు న్నాయి. విశ్రాంతి భవనాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో గుట్టుచప్పుడు కాకుండా మాయం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్ నుంచి ఎలాంటి వస్తువు బయటికి వెళ్లేం దుకు అవకాశం లేదు. అన్ని గేట్ల దగ్గర సెక్యూరిటీ సిబ్బంది ఉంటారు. అయినప్పటికీ మంచాలు మాయం అవుతుండటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతు విశ్రాంతి భవనం నుంచి ఐదారు మంచాలు బయటికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఒక్కో మంచం విలువ రూ.5 వేల వరకు ఉంటుం ది. రైతు విశ్రాంతి భవనంలో ఎన్ని మంచాలు ఉన్నా యనే దానిపై లెక్కలు లేవు. దీన్ని అవకాశంగా తీసు కొని మంచాలు మాయం కాలేదనే వాదనను తీసుకొచ్చినట్లు సమాచారం. ఏడాదిన్నర క్రితం మార్కెట్‌లో టార్పాలిన్‌లు పెద్ద ఎత్తున మాయం అయ్యాయి. మార్కెట్ కమిటీలో పనిచేసే వారు టార్పాలిన్‌లను మాయం చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. బాధ్యుల నుంచి రికవరీ కూడా చేశారు. తాజాగా మంచాలు మాయం కావడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై మార్కెట్ కమిటీ విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జర భద్రం!

డ్వామా, వ్యవసాయ శాఖ కార్యాలయాల మధ్య పైకప్పు దుస్థితి



మహిళల టాయ్‌లెట్స్ దుస్థితి



- డ్వామా, వ్యవసాయ శాఖల మధ్య కూలడానికి సిద్ధంగా ఉన్న పైకప్పు
- భయంభయంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్ దయనీయం గా తయారైంది. పలుచోట్ల పైకప్పు శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకునే వారు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు ఊడి పడుతున్న పెచ్చులు, మరోవైపు పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తున్నా పట్టించుకునే వారు లేరు. జిల్లా పరిపాలనకు ఆధ్యులైన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కొలువైన జిల్లా పరిపాలన కేంద్రం దయనీ యంగా తయారు కావడం పట్ల సర్వత్రా ఆం దోళన వ్యక్తం అవుతోంది. కలెక్టరేట్‌లోని వ్యవ సాయ శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యా లయాల మధ్య పైకప్పు అపుడో, ఇపుడో కూలడానికి సిద్ధంగా ఉం ది. దీంతో ఉద్యోగులు ప్రాణాలర చేత పెట్టుకొని తిరగాల్సి వస్తోంది. కూల డానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఎవరూ పట్టించు కోవడం లేదు. జరగరానిది ఏదైనా జరిగితే ప్రభు త్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందనే అభి ప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు అపరిశు భ్రత పేరుకుపోయి ఉంది. వ్యవసాయ శాఖ, డ్వామా ఉద్యోగులకు ఉద్దేశించిన టాయ్‌లెట్స్ నిరంతరం పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్న చోటనే ఉన్నాయి. వీటిలో నీరు లేక దుర్గంధం వెద జల్లుతూ బీభత్సంగా తయారయ్యాయి. ఎక్కడా అవకాశం లేకపోవడం వల్ల ఉద్యోగులు అత్యవస రాలకు ఈ టాయ్‌లెట్స్‌నే ప్రాణాలరచేత పెట్టు కొని ఉపయోగిస్తున్నారు. అలాగే కలెక్టరేట్ ఆవరణలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

— కర్నూలు(అగ్రికల్చర్)

సంక్షిప్తం

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యతివ్వాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో రాయలసీమ బ్రాహ్మణు లకు ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు కోరారు. రాజకీయంగా పూర్తి వెనుకబాటుకు గురవుతున్న రాయలసీమలోని బ్రాహ్మణులకు అవకాశాలు కల్పించాలన్నారు. బుధవారం ఇక్కడకు వచ్చిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌ను కలిసి పలు విషయాలను తెలియజేసినట్లు ఆయన చెప్పా రు ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణుల ఆర్థిక అభి వృద్ధికి తోడ్పడాలని, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవదాయ శాఖ పరిధిలోకి తీసు కురావాలని కోరినట్లు చెప్పారు. గతంలో ఉన్న అన్ని పథకాలను బ్రాహ్మ ణ కార్పొరేషన్ ద్వారా అమలు చేయాలని కోరామన్నారు. ఈ విషయాలను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళతామని జనార్దన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

హైరిస్క్ గర్భిణికి అరుదైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణికి వైద్యులు సిజేరియన్ ద్వారా ప్రసవం చేసి ప్రాణాలు కాపాడారు. చికిత్స వివరా లను బుధవారం స్థానిక అమీలియో హాస్పిటల్‌లో ఆసుపత్రి ఎండీ డాక్టర్ సి.లక్ష్మీప్రసాద్ వివరించారు. 'అధిక రక్తపోటు, ప్లేట్‌లెట్ కణాలు తగ్గిపోవడం వంటి సమస్యలతో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన గర్భిణి స్వప్న అమీ లియో హాస్పిటల్‌లో చేరింది. గర్భిణికి ప్లేట్‌లెట్ కణాలు 1.50 లక్షలు ఉండాల్సి ఉండగా కేవలం 20 వేలు మాత్రమే ఉన్నాయి, బీపీ 200/140తో పాటు అధిక రక్తస్రావంతో బాధపడుతోంది. వాటన్నింటినీ నియంత్రించి గైనకాలజిస్టు డాక్టర్ మాబూని, అనస్తీషియా వైద్యులు డాక్టర్ విజేత సిజేరియన్ ద్వారా ప్రసవం చేశారు. అలాగే ఈ నెల 3న కడుపునొప్పితో బాధపడుతున్న 12 ఏళ్ల బాలికకు రిసిక్షన్ అండ్ అనాస్టమోస్ ఆపరేషన్ చేసి ఉపశమనం కలిగించినట్లు ఆయన వెల్లడించారు.

'పుర మిత్ర' ద్వారా సమస్యలు తెలియజేయండి

కర్నూలు (టౌన్): నగర ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు పుర మిత్ర యాప్‌ను ఉపయోగించుకోవాలని మంత్రి టీజీ భరత్ బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. పుర మిత్ర యాప్ ద్వారా సమస్యలను ఫొటో తీసి పోస్ట్ చేస్తే అధికారులు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. 24 గంటల్లో సమస్యను పరిష్కారం అవుతుందని తెలిపారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు వంటి సమ స్యలను ఈ యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

ఆర్‌యూ సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో సమస్యల పరిష్కారానికి కృ షి చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. వర్సిటీ వైస్ చాన్స లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు బుధవారం ఎంపీ నాగరాజును ఆయన స్వగృహంలో కలిశారు. వర్సి టీలోని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించి వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తారని ఎంపీ హామీ ఇచ్చారు.

సర్వే ఏడీపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): ఇటీవల జరిగిన విలేజ్ సర్వేయర్ల బదిలీల్లో చేతివాటం ప్రదర్శించిన సర్వే ఏడీపై శాఖాపరమైన విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాము నాయక్, హౌసింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు హనుమన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాయం త్రం సర్వే ఏడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన బదిలీల్లో రవితేజ అనే విలేజ్ సర్వేయర్‌ను మధ్యవర్తిగా చేసుకొని ఏడీ వసూళ్ల పర్వం కొనసాగించారన్నారు. ఫోకల్ స్థానాల కోసం లక్షన్నర నుంచి మూడు లక్షల వరకు డబ్బులు వసూలు చేసి నట్లు చెప్పారు. డబ్బులు తీసుకొని కూడా బదిలీ చేయకపోవడంతో ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని అడిగితే తనకు ఇవ్వలేదని చెప్పడం అన్యాయ మన్నారు. సర్వే శాఖలో జరిగిన అక్రమ బదిలీలపై పూర్తిస్థాయిలో విచారణ జర పాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు స్పౌజ్ కేసుల్లో బదిలీలు చేయకుం డా అన్యాయం చేసి, డబ్బులకు ఫోకల్ స్థానాలను అమ్ముకున్నారని దుయ్యబట్టారు.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఏవీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అనుసరి స్తున్న కార్మిక వ్యతి రేక విధానాలపై సమరశీల పోరాటా లకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగే శ్వరరావు పిలుపుని చ్చారు. స్థానిక కారి ్మక, కర్షక భవన్‌లో బుధవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జిల్లా స్థాయి కార్యకర్తల వర్కుషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. జూలై 9న నిర్వహించిన కార్మిక సమ్మె విజయవంతం కావడంతో ప్రధాని మోదీ గుండెల్లో రైళ్లు పరుగెడు తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది కార్మికులు సమ్మెలో పాల్గొ న్నట్లు చెప్పారు. మోదీ ప్రభుత్వం మొండిగా లేబర్ కోడ్‌లను అమలు చేయ డానికి ప్రయత్నిస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను దొడ్డిదారిన అమలు చేస్తోంద ని, పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ.. సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు జరుగబోతున్నాయని, ఆ మహాసభలను జయప్రదం చేయ డానికి సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, జిల్లా నాయకురాలు నిర్మల, నాయకులు సాయిబాబా, విజయ్, నారాయణస్వామి, ప్రభాకర్,గోపాల్,రాముడు, రాజశే ఖర్,సుధాకరప్ప, బి.రాధాకృష్ణ, మహ్మద్, మోహన్ పాల్గొన్నారు.